
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


స్త్రీశక్తి.. సూపర్



ఆర్థిక భరోసా కలిగేలా.. మహిళల్లో సాధికారిత పెంపొందేలా.. ప్రయాణ భారం నుంచి ఉపశమనం పొందేలా.. అన్ని వర్గాల మహిళలకు దన్నుగా.. ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' విజయవంతంగా సాగుతోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై గత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'స్త్రీశక్తి' పథకాన్ని ప్రారంభించారు. ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్న మహిళలు 'స్త్రీశక్తి' ప్రారంభంతో సంబరాలు చేసుకున్నారు. సూపర్ సిక్స్‌లో స్త్రీ శక్తి పథకానికి మహిళలు నీరాజనాలు పలుకుతున్నారు. పథకం ప్రారంభం నుంచి రోజు రోజుకు మహిళలు, విద్యార్థినుల నుంచి ఆదరణ లభిస్తోంది. దీంతో జిల్లాలోని అన్ని డిపోల పరిధిలో పథకాన్ని ఆర్టీసీ అధికారులు విజయవంతంగా అమలు చేస్తున్నారు. ఉచిత ప్రయాణంలో ఎటువంటి అవాంతరాలు ఎదురు కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గత నెల రోజులుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల ఆక్యుపెన్సీ గణనీయంగా పెరిగింది. ఈ నెల రోజుల వ్యవధిలో ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పల్లె వెలుగు బస్సుల్లో అంచనాలకు మించి మహిళలు ప్రయాణిస్తున్నారు. ఈ పథకం తో ఉచితంగా బస్సుల్లో ప్రయాణి స్తున్న మహిళల మోము లో ఆనందం వెల్లివిరుస్తోంది. అన్ని వర్గాల మహిళలకు స్త్రీశక్తి పథకం దన్నుగా నిలుస్తోంది.

ఆర్థిక వెసులుబాటు

ఈ పథకం సద్వినియోగం చేసుకుం టున్న వారిలో రోజువారీ కూలి పనులకు వెళ్లే నిరు పేదలతో పాటు పట్టణాల్లో కూరలు, పండ్లు తదితరాలు విక్రయించు కునే చిరువ్యాపారులు ఎక్కు వగా కనిపిస్తున్నారు. రోజువారీ ఉపాధి కోసం పట్టణాలకు వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణం మరింత గా ఆర్థిక వెసులుబాటు అందిస్తోంది. దీంతో వీరందరూ ఉచిత ప్రయాణం ద్వారా నెలకి రూ.2,500 నుంచి రూ.3,000 వరకు టిక్కెట్ల వ్యయం మిగులుతోంది. విద్యార్థినులు నెలవారీ బస్సు పాసులు కొనుగోలు చేసి ప్రయాణించేవారు. వీరికి ఈ ఉచిత ప్రయాణం కలిసివచ్చింది.

• బస్సు నడపండి..

స్త్రీశక్తికి శ్రీకారం చుట్టిన నెల రోజుల వ్యవధిలో డిపోల వారీ గా తమ ప్రాంతానికి బస్సు నడపాలనే డిమాండ్లు అధికమవు తున్నాయి. నేతలతో పాటు ప్రజల నుంచి కూడా ఆర్టీసీ అధికారులకు వస్తోన్న అర్జీలన్నీ కూడా పల్లె ప్రాంతాలవే కావడం గ్రామీణులకు స్త్రీశక్తి పథకం ఏ స్థాయిలో ఉపయోగడ పడుతుందో అద్దం పడుతోంది. పథకానికి వస్తున్న ఆదరణతో పాటు ప్రయాణికుల నుంచి వస్తున్న వినతులను పరిగణనలోకి తీసు కున్న అధికారులు అదనపు బస్సుల ప్రతిపాదనలపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు.

పథకం ప్రారంభించి నెల
రోజురోజుకు పెరుగుతోన్న ఆదరణ

- ఉచిత ప్రయాణంతో మహిళల్లో ఆనందం
- చిరుద్యోగులకు నెలకు రూ.3 వేల వరకు ఆదా
- ఆర్టీసీ బస్సుల్లో గణనీయంగా పెరిగిన ఆక్యుపెన్సీ


రేపల్లె బస్టాండ్ బస్సు ఎక్కుతున్న మహిళలు


బస్సుల కోసం వేచి ఉన్న మహిళలు

30 రోజులు.. 18 లక్షల జీరో టిక్కెట్లు

బాపట్ల, చీరాల, అద్దంకి, రేపల్లె డిపోల పరిధిలో 253 బస్సులు ఉండగా 214 బస్సుల్లో స్త్రీశక్తి పథకం అమలవు తుంది. గతంలో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 75,000 వర కు ఉండగా అందులో మహిళల వాటా 40 శాతంగా ఉండేది. స్త్రీశక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా రోజువారీ ప్రయాణికుల సంఖ్య దాదాపు లక్షకు చేరుకోగా అన్ని బస్సులోనూ ఆక్యుపెన్సీ వందశాతానికి చేరింది. 65 రూట్లలో అయితే 150 శాతం ఆక్యుపెన్సీ నమోదవుతుంది. ఈ నెల రోజుల్లో 18 లక్షల జీరో టిక్కెట్లు జారీ చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. తద్వారా ఆర్టీసీకి అదనంగా సమకూరిన ఆదాయం రూ.6 కోట్లు ఉంది. సగటున రోజుకు 55,000 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నట్లు జీరో టిక్కెట్ల జారీ లెక్కల ద్వారా తెలుస్తుంది. పథకం అమలైన తొలివారం రోజువారీ మహిళా ప్రయాణికుల సగటు 40,000కు పరిమితం కాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 55,000కు చేరడం గమనార్హం.

గ్రామీణ నేపథ్యం ఎక్కువగా ఉండడమే...

జిల్లా వ్యాప్తంగా గ్రామీణ నేపథ్యం ఉన్న ప్రాంతాలే ఎక్కువ. ఈ కారణంగానే జిల్లాలో స్త్రీశక్తి ఇంతభారీగా విజయవంతం అవుతుందని తెలుస్తోంది. ఈ నెల రోజుల వ్యవధిలో జారీ చేసిన జీరో టిక్కెట్లలో దాదాపు 60 శాతం రూ.50లోపే. పల్లెల నుంచి మండల కేంద్రాలకు అత్యధికంగా మహిళలు ప్రయాణించారు.

(బాపట్ల ఆంధ్రజ్యోతి)
సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అమలు చేసిన స్త్రీ శక్తి పథకం జిల్లావ్యాప్తంగా సూపర్ సక్సెస్ అయింది. ఈ పథకాన్ని స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15న ప్రారంభించగా శనివారంతో 30 రోజులు పూర్తి చేసుకుంది. సోమవారంతో పథకానికి శ్రీకారం చుట్టి నెల రోజులు అవుతుంది. ఆర్టీసీ బస్సులో రోజువారీ ప్రయాణికుల సంఖ్యలో పెరుగుదలతో స్త్రీశక్తి పథకం సూపర్‌హిట్ దిశగా వెళుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమ వుతోంది. నారీమణుల నుంచి స్త్రీశక్తి అత్యంత (మిగతా 7వ పేజీలో)

గంజాయి కట్టడిపై దృష్టి

ఎస్పీగా ఉమామహేశ్వర్ బాధ్యతలు స్వీకారం

తీర ప్రాంత భద్రతకు ప్రత్యేక చర్యలు


బాధ్యతలు స్వీకరిస్తున్న బి.ఉమామహేశ్వర్

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను కట్టడి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం వేదపండితుల మంత్రోశ్ఛరణల మధ్య ఎస్పీగా బి.ఉమామహేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. అంతకముందు ఆయనకు పోలీసు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన జిల్లా మూడో ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. డీఎస్పీలు పి.జగదీష్‌నాయక్, ఎ.శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఎండి మోయిన్, పి.వి జయసారధి, సీఐలు, ఎస్సైలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తామన్నారు. సముద్రతీర ప్రాంతంలో ప్రత్యేక భద్రతా చర్యలపై మరింత దృష్టి పెడతామన్నారు. శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. నేరస్తులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

అధికారులతో సమీక్ష

బాధ్యతల స్వీకరణ అనంతరం అధికారులతో ఎస్పీ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలు, స్థానికంగా ఉన్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ ప్రాధాన్యతను అనుసరించి నేరనియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. గంజాయి రవాణా, విక్రయాల కట్టడికి తగిన కార్యాచరణను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సైబర్, వైట్‌కాలర్ నేరాలను అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను నిబద్ధతతో నిర్వహిస్తే అధికశాతం నేరాలను ఆదిలోనే అరికట్టవచ్చన్నారు. సముద్రతీరంలో పర్యటించే యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గస్తీ పెంచాలని తెలిపారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు అవసరమైన సహాయాన్ని తక్షణమే అందించాలన్నారు.

బార్లకు మళ్లీ గడువు పెంపు

- ఈ నెల 17 వరకు పొడిగించిన ఎక్సైజ్
- జిల్లాలో రీనోటిఫికేషన్‌లో వచ్చిన దరఖాస్తులు 17

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
మద్యం బార్ల ఏర్పాటుకు సంబంధించి ఎక్సైజ్‌శాఖ జారీ చేసిన రీ నోటిఫికేషన్‌లో తొలుత ఇచ్చిన గడువు ఆదివారంతో ముగిసింది. రెండో సారి దరఖాస్తుల కోసం ఆహ్వానించినా స్పందన అరకొరగానే ఉంది.



దీంతో దరఖాస్తులకు మరో మూడు రోజులు గడువు పొడిగిస్తూ ఎక్సైజ్ విభాగం నిర్ణయం తీసుకుంది. బార్ల ఏర్పాటుకు సంబంధించి ఈ నెల 17 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. జిల్లాలో మొత్తం 15 బార్లకు ఇప్పటి వరకు 17 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ఒక్కో బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే లాటరీకి అవకాశం ఉంటుంది. గడువు పొడిగించడంతో ఈ మూడు రోజుల్లో వచ్చే దరఖాస్తులపైనే ఆశలు పెట్టుకున్న అధికారులు శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారు.

బీచ్.. పనులు వేగవంతం చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్ • ఎమ్మెల్యే వేగేశనతో కలిసి ఫెస్టివల్ ప్రాంగణం పరిశీలన

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని 26, 27, 28 తేదీల్లో సూర్యలంక తీరంలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సూర్యలంక తీరాన్ని ఆదివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. బీచ్ ఫెస్టివల్‌ను వేడుకగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేగేశన సూచించారు.

రాష్ట్రీయ పండుగలా ఫెస్టివల్

బీచ్ ఫెస్టివల్‌ను రాష్ట్రీయ పండుగలా అత్యంత ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. బీచ్ ఫెస్టివల్ నిర్వాహణపై కలెక్టరేట్ నుంచి ఆదివారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ నెల 25వ తేది నాటికి బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. 27న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేడుకలకు హాజరవుతున్నందున ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. తేదీల వారీగా వేడుకల షెడ్యూల్ విడుదల చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, పర్యాటక కార్పొరేషన్ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ప్రమోద్, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, డీపీవో ప్రభాకర్, రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి, పౌరసరఫరాలశాఖ డీఎమ్ శివపార్వతి, డీఎస్‌వో జలీల్‌బాషా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.


బీచ్ ఫెస్టివల్ ప్రదేశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

స్కూళ్లకు సార్లొస్తున్నారు..

- తుది దశకు మెగా డీఎస్సీ మెరిట్ జాబితా
- ఎంపికైన ఉపాధ్యాయులకు 20 నుంచి కౌన్సెలింగ్
- 19న ముఖ్యమంత్రి ద్వారా నియామక పత్రాల పంపిణీ
- రాజధానిలో బహిరంగ సభ.. ప్రతీ మండలం నుంచి బస్సులు
- ఎంపికైన అభ్యర్థితో పాటు మరొకరికి అవకాశం.. ఏర్పాట్లలో అధికారులు

(వేమూరు, గుంటూరు- విద్య, ఆంధ్రజ్యోతి)
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరిపోనున్నది. ఈ నెలాఖరుకు స్కూళ్లకు ఉపాధ్యాయులు రానున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందిని ఎంపిక చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 19న స్వయంగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి రాజధాని అమరావతి సచివాలయం సమీపంలో బహిరంగ సభకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధ్యాయులతో నిర్వహించే సభను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో పాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ఈ సభలో పాల్గొనేందుకు అవసరమైన ఆహ్వానాలను నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అధికారులు అందజేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థి తనతో పాటు కుటుంబంలోని మరో వ్యక్తిని కూడా సభకు తీసుకువచ్చేందుకు అనుమతి ఇచ్చారు. వీరందరూ సభకు హాజరయ్యేందుకు ప్రతీ మండలం నుంచి ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేస్తున్నారు. ఆ బస్సుల ఏర్పాటు బాధ్యతను విద్యాశాఖాధికారులకుప్రభుత్వం అప్పగించింది.


సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

1,130 పోస్టుల భర్తీ

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 1600 ఉపాధ్యాయ పోస్టులకు ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మెగా డీఎస్సీ లో ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా తుది దశకు చేరింది. ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా అర్హులైన అభ్యర్థులను క్యాడర్ల వారీగా ఎంపిక చేసి జాబితాను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. ఆదివారం వరకు నిబంధనలను అనుసరించి సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలనను ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, గుంటూరు డీఈవో రేణుక పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇందులో ప్రస్తుతానికి సుమారు 1,130 పోస్టుల భర్తీకి విద్యాశాఖ సిద్ధమైంది. 530 ఎస్‌జీటీ, 600 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 20 నుంచి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల ఆధారంగా మెరిట్ లిస్టు విడుదల చేసి గతంలో ఉపాధ్యాయులను నియమించేవారు. అయితే ఈసారి కౌన్సెలింగ్ తరహాలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. మెరిట్ ఆధారంగా పాఠశాలలకు ఇచ్చిన ఆప్షన్ల ప్రకారం నియామకాలు జరగనున్నాయి. దీని వల్ల పోస్టుల భర్తీలో రాజకీయ జోక్యం నిరోధించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వీర్లచెరువు వెలవెల

- అడుగంటిన నీరు.. సాగు ప్రశ్నార్థకం
- డంపింగ్ యార్డుగా మారిన చెరువు ప్రాంతం

బల్లికురవ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నీరు లేక మండల పరిధిలోని వీర్లచెరువు వెలవెలపోతోంది. చెరువుకు నాగార్జున సాగర్ నుంచి నీరు వచ్చే కాల్వలు సక్రమంగా లేవు. సాగర్ జలాశయం నుంచి నెల నుంచి నీరు విడుదల అవుతున్నా చెరువుకు సక్రమంగా నీరు చేరలేదు. చెరువులో నీరు లేకపోవడంతో ఆయకట్టు పరిధిలో పంటల సాగు ప్రశ్నార్థకంగా ఉంది. చెరువు భూభాగంలో కొందరు రాత్రిళ్లు గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల నుంచి వచ్చే వ్యర్థరాళ్లను పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. దీంతో ముందు ముందు చెరువులో నీటితో పూర్తి స్థాయిలో నిండితే ఈ రాళ్లు అడ్డుగా మారతాయని రైతులు వాపోతున్నారు. నక్కబొక్కలపాడు, బల్లికురవ గ్రామాల పరిధిలోని భూములకు ఈ చెరువు నీరే ఆధారం. చెరువు కింద బల్లికురవ గ్రామ ఎత్తిపోతల పథకం ఉంది. పర్యవేక్షణ లేకపోవడంతో చెరువు పరిస రాల్లో వ్యర్థాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని రైతులు అంటు న్నారు. చెన్నుపల్లి రోడ్డులో చెరువు అంచుల్లో వ్యర్థాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.


• నీరు లేక ఒట్టిపోయిన వీర్ల చెరువు

వరద విపత్తుపై ముందస్తు చర్యలు

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్
- వారధి వద్ద గండి పరిశీలన.. అధికారులతో సమీక్ష


అరవింద వారధి వద్ద వరద ప్రవాహంతో పాటు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కొల్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కృష్ణానదికి నీటి ప్రవాహం పోటెత్తుతున్నందున వరద విపత్తును ఎదుర్కొనేందుకుముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం కొల్లూరు మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద నదిలో వరద ప్రవాహంతో పాటు వారధి ఎగువన పడిన గండి ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాల గురించి ఆర్డీవో రామలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. నదిలో గత ఏడాది 11 లక్షల పైచిలుకు నీరు వచ్చినందున ఇప్పుడు అంతకు మించి వస్తే వరద విపత్తును ఏవిధంగా ఎదుర్కోవాలో అధికారులు నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయిన వెంటనే అధికారులంతా వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం 2 లక్షల 70 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుందని, అది మరింత పెరిగి 3.50 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి బోట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వరదకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులు వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు.

రెవెన్యూ కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ : కలెక్టర్

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ పరిధిలోని రెవెన్యూ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ప్రతీ సోమవారం నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. అర్జీదారులు ఆన్‌లైన్ ద్వారా అర్జీలను నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం మీ కోసం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అర్జీదారులు ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల స్థితికి సంబంధించి టోల్ ఫ్రీనెంబరు 1100కు కాల్ చేయవచ్చన్నారు.

దిక్సూచి



మేనేజ్‌మెంట్, కామర్స్ విద్యార్థుల కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) కొన్ని ఉచిత కోర్సులను అందిస్తోంది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని 'స్వయం' (https://swayam.gov.in) - పోర్టల్‌లో ఈ కోర్సుల పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు, అలాగే ఎన్‌రోల్ కావచ్చు.

మేనేజ్‌మెంట్ విద్యార్థుల కోసం 'ఇగ్నో' ఉచిత కోర్సులు

ఫైనాన్షియల్ అకౌంటింగ్: అకౌంటింగ్, అకౌంటింగ్ ప్రాసెస్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ ప్రిపరేషన్, అండర్ స్టాండింగ్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ తదితరాలను ప్రొఫెసర్ సునీల్ కుమార్ బోధిస్తారు. మొత్తం 16 వారాల కోర్సు. 2025 డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు.

బిజినెస్ ఆర్గనైజేషన్ అండ్ మేనేజ్‌మెంట్: బిజినెస్ అండ్ బిజినెస్ ఎంట్రప్రైజెస్‌పై ఉంటుంది. ప్రొఫెసర్ నావెల్ కిశోర్, అతని టీమ్ దీనిని బోధిస్తారు. 16 వారాల కోర్సు. పరీక్షలు 2025 డిసెంబర్‌లో నిర్వహిస్తారు.

బిజినెస్ లా: సోషల్, డొమెస్టిక్, మోరల్, రిలీజియస్, కమర్షియల్‌కి సంబంధించిన అగ్రిమెంట్స్ మొదలైన వాటిపై కోర్సు ఉంటుంది. 16 వారాల కోర్సు, పరీక్షలు డిసెంబర్ రెండో వారంలో ఉంటాయి. ప్రొఫెసర్ డా.మధులిక సారికర్ బోధిస్తారు.

ఇన్‌కంటాక్స్ లా అండ్ ప్రాక్టీస్: ఇన్‌కంటాక్స్ చట్టాలు, ప్రాక్టీస్ పట్ల విద్యార్థులకు అవగాహన పెంచడం కోసం ఉద్దేశించిన 15 వారాల కోర్సు ఇది. డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రిన్స్‌పల్స్ ఆఫ్ మార్కెటింగ్: ఏ వ్యాపారంలోనైనా మార్కెటింగ్ రోల్‌ను అర్థం చేసుకోవడం, తదితరాలపై ఏర్పాటు చేసిన కోర్సు ఇది. ప్రొఫెసర్ డాక్టర్ అనుప్రియా పాండే దీనిని బోధిస్తారు. 16 వారాల కోర్సు. డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

బిజినెస్ కమ్యూనికేషన్: బిజినెస్ కమ్యూనికేషన్ ఎలా జరుగుతుంది, మీటింగ్స్, బిజినెస్ డీలింగ్స్, క్లయింట్ ప్రజంటేషన్ తదితరాలన్నీ ఇందులో బోధిస్తారు. ప్రొఫెసర్ డాక్టర్ రశ్మీ బన్సాల్ దీనిని బోధిస్తారు. మొత్తం 12 వారాల కోర్సు. పరీక్షలు 2025 డిసెంబర్‌లో ఉంటాయి.

ఫైనాన్షియల్ లిటరసీ: ఫైనాన్స్‌లో కెరీర్ ఎంచుకోవాలనుకునే వారికి ఉద్దేశించిన కోర్సు ఇది. భారత దేశంలో ఫైనాన్షియల్ సెక్టార్‌లో పేరొందిన వారు బోధిస్తారు.

ఎంట్రప్రెన్యూర్ స్కిల్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీస్: కోర్సు వ్యవధి 12 వారాలు. ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఫండమెంటల్స్, డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజీస్ తదితరాలపై కోర్సు ఉంటుంది. ఎంట్రప్రెన్యూర్స్ కావాలనుకునే వారిని, కాలేజ్ లెర్నర్స్, చిన్న బిజినెస్ వారిని ఉద్దేశించి తయారు చేశారు. వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ కల్పిస్తారు.

బ్యాంక్ ఉద్యోగాలు

ఎస్‌బీఐలో మేనేజర్లు

ఖాళీలు 122

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెగ్యులర్ ప్రాతిపదికన 122 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- మేనేజర్(క్రెడిట్ అనలిస్ట్): 63 పోస్టులు
- మేనేజర్(ప్రొడక్ట్స్-డిజిటల్ ప్లాట్‌ఫామ్స్): 34 పోస్టులు
- డిప్యూటీ మేనేజర్(ప్రొడక్ట్స్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్): 25 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/ ఎంబీఏ/పీజీడీబీఏ/ పీజీడీబీఎం/ సీఏ/సీఎఫ్‌ఏ/ఐసీడబ్ల్యూఏ/ బీఈ/బీటెక్ తోపాటు పని అనుభవం ఉండాలి.

వయసు: మేనేజర్‌కు 28-35 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 25-32 ఏళ్లు, మేనేజర్ క్రెడిట్ అనలిస్ట్ 25-35 ఏళ్ల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 2

వెబ్‌సైట్: https://sbi.bank.in/



ఐఓబీలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 127

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్(ఐఓబీ)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెలువడింది.

అర్హత: డిగ్రీ/బీఆర్క్/బీటెక్/బీఈ, ఎంఎస్సీ/ ఎంఈ/ ఎంటెక్ ఎంబీఏ/పీజీడీబీఏ/పీజీడీఎమ్ పాసై ఉండాలి.

వయసు: 2025 సెప్టెంబర్ 1 నాటికి పోస్టులను అనుసరించి 25 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా జరుగుతుంది.

చివరి తేదీ: 2025 అక్టోబర్ 3

వెబ్‌సైట్: www.iob.bank.in/Careers

ఆర్‌బీఐలో గ్రేడ్-బీ ఆఫీసర్లు

ఖాళీలు 120

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 120 ఆఫీసర్ గ్రేడ్-బీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

- ఆఫీసర్స్ గ్రేడ్ బీ(జనరల్ కేడర్): 83
- ఆఫీసర్స్ గ్రేడ్-బీ(డీఈపీఆర్ కేడర్): 17
- ఆఫీసర్స్ గ్రేడ్-బీ(డీఎస్ఐఎమ్ కేడర్): 29

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ పాసై ఉండాలి. పని అనుభవం కూడా ఉండాలి.

వయసు: 2025 సెప్టెంబర్ 1 నాటికి 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 30

వెబ్‌సైట్: https://opportunities.rbi.org.in/



స్కూలు టీచర్ల కోసం మద్రాసు ఐఐటీ ఫ్రీ ఏఐ కోర్సులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రతీ రంగాన్ని రీషేపింగ్ చేసింది. దీనికి అతీతమైన రంగం అంటూ ఇప్పుడు లేదు. దీనికి ఎడ్యుకేషన్ మినహాయింపు ఏమీ కాదు. లెర్నింగ్ ప్రక్రియను ఏఐ పూర్తిగా మార్చేసింది. ఈ ప్రక్రియను ఎవరైతే తరగతి గది వరకు తీసుకెళ్లగలరో వారే భవిష్యత్తులో విజయవంతమైన ఉపాధ్యాయులుగా నిలబడగలుగుతారు. దేశానికి అలాంటి టీచర్లను తయారు చేయడం కోసం మద్రాస్ ఐఐటీ ఒక ప్రోగ్రామ్‌ను రూపొందించింది. కిండర్ గార్టెన్ మొదలుకుని ఇంటర్ వరకు దేశవ్యాప్తంగా ఉన్న స్కూలు టీచర్ల కోసం 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్' పేరుతో ఉచిత ఆన్‌లైన్ కోర్సులను ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ స్వయం పోర్టల్ ద్వారా ఈ కోర్సులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. గతంలో 'ఏఐ ఇన్ ఫిజిక్స్', 'ఏఐ ఇన్ కెమిస్ట్రీ', 'ఏఐ ఇన్ అకౌంటింగ్', 'క్రికెట్ అనాలిసిస్ విత్ ఏఐ', పైథాన్ ద్వారా ఏఐ/ఎంఎల్ కోర్సులను తెచ్చింది.

- 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్' కోర్సు కాలవ్యవధి 25 నుంచి 45 గంటలు. ఇది పూర్తిగా ఉచితం. దీనిలో సర్టిఫికెట్ కావాలనుకునే వ్యక్తులు నామ మాత్రపు ఫీజు చెల్లించి, ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్ష రాయాలి. సర్టిఫికెట్ వద్దు అనుకునేవారు ఆన్‌లైన్ కోచింగ్‌తోనే ఆపేయవచ్చు.
- ఏఐ అవగాహన పెంచుకోవాలనుకునేవారు, ఏఐతో తమ బోధన ప్రమాణాలు పెంచుకోవాలనుకునేవారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి ఏఐ, కోడింగ్ అనుభవం అవసరం లేదు. డిజిటల్ లిటరసీ ఉంటే చాలు అని చెబుతున్నారు మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ వి.కామకోటి. ఆర్ట్స్, కామర్స్, సైన్స్ ఇలా అన్ని రంగాల వారికీ ఉపయోగ పడేలా ఈ కోర్సును డిజైన్ చేశారు. 2025 అక్టోబర్ 10లోపు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: swayamplus.swayam2.ac.in/aiforallcourses

SCHOLARSHIP ALERT

JK Tyre Shiksha Sarthi Scholarship Program

Description: JK Tyre & Industries Limited invites applications from daughters of heavy vehicle drivers who are pursuing general or professional undergraduate or diploma courses and reside in select locations.

Eligibility: Open to female students who are HMV Driver's daughters and are enrolled in general or professional undergraduate or diploma courses.

- Applicants must have secured a minimum of 55% marks in their previous academic year.
- Annual family income must be less than or equal to 5,00,000.
- Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttarakhand, Karnataka, and Tamil Nadu.
- Children of employees of JK Tyre and Buddy4Study are not eligible to apply.

Prizes & Rewards: Annual Fixed Scholarship Details:

- Professional Undergraduate Courses: INR 25,000
- General Undergraduate Courses: INR 15,000
- Diploma Courses: INR 15,000

Last Date to Apply: 06-10-2025 ***Application mode:*** Online Application only

Short Url: www.b4s.in/aj/JKTS3

OakNorth STEM Scholarship Programme

Description: The OakNorth STEM Scholarship Programme is an initiative by OakNorth aimed at supporting underprivileged women aspiring to pursue a degree in STEM (Science, Technology, Engineering, Mathematics). This scholarship is available to female students from Haryana, Uttarakhand, and Bihar who have completed their Class 12 and are currently enrolled in a STEM-related undergraduate program (any year) at government colleges or universities.

Eligibility: The scholarship is available to students who are residents of Haryana, Uttarakhand, and Bihar.

- Only female applicants are eligible for consideration.
- Applicants should be enrolled in an undergraduate STEM program (Science, Technology, Engineering, Mathematics) at government universities or colleges in India, regardless of the year of study.
- Candidates must have secured an aggregate of 75% or more in their Class 12 (or equivalent) exam, with at least 65% in the previous class/semester/year (if applicable).
- The annual family income of the applicant should not exceed 3 lakhs.
- Children of Buddy4Study and OakNorth employees are not eligible to apply.

Prizes & Rewards: 30,000 (fixed amount) ***Last Date to Apply:*** 30-09-2025


Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/ONSS4

buddy4study.com

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



దసరాకు ఇడ్లీకొట్టు

ధనుశ్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇడ్లీ కొట్టు'. డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆకాశ్ బాస్కరన్, ధనుశ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఇది ధనుశ్ దర్శకత్వం వహిస్తోన్న నాలుగో చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. దసరా సందర్భంగా తెలుగు, తమిళ్‌లో అక్టోబరు 1న విడుదలవుతోందీ చిత్రం. తెలుగులో వేదక్షర మూవీస్ బ్యానర్‌పై నిర్మాత చింతపల్లి రామారావు విడుదల చేస్తున్నారు. సత్యరాజ్, అరుణ్ విజయ్, నిత్యా మీనన్, షాలినీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: జీకే ప్రసన్న, డీఓపీ: కిరణ్‌కౌశిక్, సంగీతం: జీవి ప్రకాశ్‌కుమార్.



'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ పూర్తి

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తర్వాత పవన్ కల్యాణ్- హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై అభిమానుల్లో అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తాజాగా చిత్రబృందం భారీ షెడ్యూల్‌ను విజయవంతంగా ముగించింది. పవన్ కల్యాణ్ కూడా తన భాగం చిత్రీకరణను పూర్తి చేశారు. త్వరలోనే నిర్మాణాంతర కార్యక్రమాలు మొదలు పెట్టనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

మరో పాట సిద్ధం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓజీ'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన 'గన్స్ అండ్ రోజెస్' గీతాన్ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. తమన్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన స్పెషల్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది.



ఊర్వశీ రౌతేలాకు ఈడీ సమన్లు

బెట్టింగ్ యాప్స్ కేసులో భాగంగా బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. '1 ఎక్స్ బెట్' అనే బెట్టింగ్ యాప్ కేసుకు సంబంధించి ఈడీ మంగళవారం ఊర్వశీని విచారించనుంది. నేడు నటి, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మిమి చక్రవర్తి కూడా ఇదే యాప్ కేసు విషయంలో ఈడీ విచారణకు హాజరు కానుంది. కాగా, ఇప్పటికే ఈ కేసు విషయంలో పలువురు సెలబ్రిటీలను ఈడీ విచారించింది.

అలాంటి పాటలు రాయడం చాలా కష్టం



శ్రీమణి

నాగచైతన్య నటించిన '100% లవ్' చిత్రంతో గీతరచయితగా టాలీవుడ్‌లో అడుగుపెట్టారు శ్రీమణి. ఆ తర్వాత వరుస చిత్రాలలో ఆయన రాసిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం 'ఆకాశంలో ఒక తార', 'సంబరాల యేటి గట్టు', 'ఇండియా హౌస్' చిత్రాలకు గీతాలు రాస్తున్న శ్రీమణి, తాజాగా మీడియాతో ముచ్చటించారు. 'అత్తారింటికి దారేది'లో పవన్‌కల్యాణ్ కోసం రాసిన 'ఆరడుగుల బుల్లెట్టు' సాంగ్ నా కెరీర్‌కు ఎంతగానో దోహదపడింది. నాకు కావాల్సిన బ్రేక్ ఇచ్చింది. 'ఎమ్‌సీఏ'లో 'ఎక్కడ ఎక్కడ' పాట వల్ల ప్రేమ పాటలకు ఎక్కువగా రాసే అవకాశం దక్కింది. ఒకప్పుడు పాట ప్రేక్షకులకు చేరువ కావడానికి కొంత సమయం పట్టేది. కానీ ఇప్పుడున్న సోషల్ మీడియా ట్రెండ్ పుణ్యమా అని విన్న వెంటనే నచ్చేయాలి. అలాంటి పాటలు రాయడం గీత రచయితలకు చాలా కష్టం. అయినా ఆ సవాల్‌ను స్వీకరించి పాటను పదేళ్ల పాటు గుర్తుపెట్టుకునేలా రాస్తున్నాం. దర్శకుడు సుకుమార్ నేను ఆరాధించే వ్యక్తుల్లో ఒకరు. 'గీత గోవిందం'లో నేను రాసిన 'వచ్చిందమ్మా' పాట విని ఆయన అభినందించడం చాలా గొప్పగా అనిపించింది. అలాగే దివంగత గేయరచయిత, సిరివెన్నెల సీతారామశాస్త్రి గారు 'మహర్షి' పాట విని బాగా రాశావని ప్రశంసించడం మరిచిపోలేని అనుభూతి' అని చెప్పారు.

వినోదంతో పాటు ఆలోచింపజేస్తుంది

- రామాంజనేయులు జవ్వాజి



"భద్రకాళి' లాంటి పొలిటికల్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రాలేదు. ఈ సినిమాలో మంచి వినోదంతో పాటు ప్రేక్షకులను ఆలోచింపజేసే అంశాలూ ఉన్నాయి. ఇందులో విజయ్ ఆంటోనీ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని నిర్మాత రామాంజనేయులు జవ్వాజి అన్నారు. విజయ్ ఆంటోని కథానాయకుడిగా అరుణ్ ప్రభు దర్శకత్వం వహించిన చిత్రమిది. సర్వంత్‌రామ్ క్రియేషన్స్ బేనర్‌పై రామాంజనేయులు నిర్మించారు. ఈ నెల 19న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

- విజయ్ ఆంటోనీతో కలసి వరుస చిత్రాలు ప్లాన్ చేశాం. మా కాంబినేషన్‌లో వచ్చిన 'మార్గన్' చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. దానికి మించిన విజయాన్ని ఈ సినిమా అందుకుంటుందని భావిస్తున్నాం. అరుణ్ ప్రభు చెప్పిన లైన్ ఆకట్టుకుంది. ఆయన విజన్ వల్లే సినిమా బాగా వచ్చింది. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఆయన కథ రాసుకున్నారు. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి సినిమా తీయడంలో ఆయనకు ఆయనే సాటి. సినిమా మొదలైన రెండు నిమిషాల్లోనే ప్రేక్షకులు కథలో లీనమైపోతారు. ఆరంభం నుంచి ముగింపు వరకూ ఎక్కడా బోర్ కొట్టదు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది.
- 'భద్రకాళి' విజయ్ ఆంటోనికి 25వ సినిమా. మంచి బడ్జెట్‌తో అన్ని హంగులతో తెరకెక్కించాం. విజయ్ పాత్ర సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. ప్రస్తుతం తమిళం, మలయాళంలోనూ మా బేనర్‌పై సినిమాలు చేస్తున్నాం. తెలుగులో సత్యదేవ్‌తో 'ఫుల్ బాటిల్', తమిళంలో 'బిచ్చగాడు' దర్శకుడు శశితో విజయ్ ఆంటోని హీరోగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాను.

సినిమా విడుదలకు అనుమతివ్వలేదు



పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్, బాలీవుడ్ నటి వాణి కపూర్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'అబీర్ గులాల్'. అయితే ఈనెల 26న సినిమా ఇండియాలో విడుదల కానున్నదనే వార్తలు కొద్ది రోజులుగా బీటౌన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ వార్తలు అవాస్తవమని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) పేర్కొంది. ఈ సినిమా విడుదలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. నిజానికి సినిమా ఈ ఏడాది మే 9న ఇండియాలో విడుదల కావాల్సి ఉంది. అయితే ఏప్రిల్ 22న పెహెల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో విడుదల నిలిచిపోయింది. కాగా, భారతదేశం మినహా ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 12న సినిమా విడుదలైంది.

కదిలించే సన్నివేశాలతో...

బి గణేశ్, బద్దెల శ్రీనివాస్, నవ్యశ్రీ ప్రధాన పాత్రధారులుగా టీకేఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ప్రేమతో దెయ్యం'. బి కుమారస్వామి నిర్మించారు. తాజాగా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ 'ఇదో విభిన్న తరహా చిత్రం.



ఇందులోని సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించేలా ఉంటాయి' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: డీఆర్ శ్యామ్‌కుమార్, సినిమాటోగ్రాఫర్: శేఖర్, సంగీతం: సీహెచ్ అమ్మ పాండు.

ఆద్యంతం ఉత్కంఠభరితం



సూపర్ రాజా కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రానికి 'ఇలాంటి సినిమా మీరెప్పుడూ చూసుండరు' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూపర్‌రాజా మాటాడుతూ 'సహజత్వానికి దగ్గరగా ఉండే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. ప్రతి ఒక్కరి జీవితానికి దగ్గరగా ఉంటుంది. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో సినిమాను రూపొందించాం. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది' అని చెప్పారు.

ఆ టైటిల్ మాకే సొంతం



'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ బయోపిక్‌ను నిర్మిస్తోంది. దీనికి అచ్చర్ల రాజుబాబు దర్శకత్వం వహిస్తున్నారు ఏఆర్‌బీ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ని కూడా ప్రారంభించబోతున్నారు. ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది. 'అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' టైటిల్ హక్కులు తమకే సొంతమని, ఫిల్మ్ ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించామని వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ పేర్కొంది. మరోవైపు ఎలాంటి టైటిల్ రిజిస్ట్రేషన్ లేకుండానే 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' పేరుతో రవి నారాయణ్ దర్శకత్వంలో ఉషారాణి మూవీస్ బేనర్‌పై వల్లూరి రాంబాబు నిర్మిస్తున్నారని వీఎస్ఆర్ ఫిల్మ్స్ ఆరోపించింది. 'రవి నారాయణ్ గతేడాది టైటిల్ ఇవ్వమని అడిగారు. మేము ఇవ్వడం కుదరదు అని తేల్చి చెప్పాం. అయినా కూడా మా అనుమతి లేకుండానే సినిమా షూటింగ్ చేస్తున్నారు. చట్టపరంగా వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం' అని వీఎస్ఆర్ ఫిల్మ్స్ సంస్థ తెలిపింది.

మురుగు కాల్వలో పడి రెండేళ్ల బాలుడి మృతి

● రెండవ రోజు మృతదేహం లభ్యం



ఇషాన్ అహమ్మద్(ఫైల్)

నకరికల్లు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుంకలగుంట గ్రామానికి చెందిన రెండేళ్ల వయస్సు గల బాలుడు అదుపు తప్పి మురుగుకాల్వలో పడి గల్లంతయ్యాడు. ఆదివారం కుంకలగుంట రైల్వే స్టేషన్ సమీపంలో పంట కాలువలో ఇషాన్ అహమ్మద్ మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ మస్తాన్‌వలి కుమారుడు ఇషాన్ అహమ్మద్ శనివారం ఇంటి బయట ఆడుకుంటూ ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడ్డాడు. బాలుడు కనిపించకపోవడంతో.. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. అయితే స్థానికులు పోలీసులకు సామాచారం అందించడంతో.. పోలీసులు శనివారం రాత్రి వరకు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టగా.. ఎలాంటి ఆచూకీ లభించలేదు. ఆదివారం కాల్వ ప్రవహించే మార్గాన గాలిస్తుండగా.. కుంకలగుంట రైల్వే బ్రిడ్జి సమీపన పంట కాల్వలో బాలుడి మృతదేహాన్ని కనుగొన్నారు. మృతుడి తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. ఏఎస్ఐ కేఎస్ఎన్ ప్రసాదు ఘటన వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నాయీ బ్రాహ్మణ జేఏసీ..

రాష్ట్ర కార్యదర్శిగా హరిప్రసాద్

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా సత్యసాయి జిల్లా కదిరికి చెందిన రొద్దారపు హరి ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర ప్రతినిధుల సభ గుంటూరులో జరిగింది. రాష్ట్ర కార్యదర్శిగా ఆయన మూడేళ్ల కొనసాగుతారని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు తెలిపారు. రాష్ట్ర హరిప్రసాద్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ జేఏసీ అన్ని సంఘాలను, నేతలను కలుపుకొని ప్రాంతాలకు, వర్గాలకు అతీతంగా నాయీబ్రాహ్మణల అభివృద్ధి, హక్కుల కోసం జేఏసీ పోరాట పటిమ అభినందనీయమన్నారు. కార్యదర్శిగా తనను నియమించిన అధ్యక్షుడు నరసింహారావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భారీ వాహనాలు.. తప్పని గుంతలు



గుంతలు పడిన తుళ్లూరు- గుంటూరు రోడ్డు

తుళ్లూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలతో సామగ్రిని నిర్మాణ కంపెనీలు చేరవేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాజధాని గ్రామాల్లో పాడైన రోడ్లకు మరమ్మతులు చేసింది. అయితే భారీ వాహనాల రాకపోకలతో సంవత్సరానికే ఆ రోడ్లకు గుంతలు పడ్డాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం వేయాల్సిన 32 ప్రధాన రోడ్లు కొన్ని అయినా పూర్తి అయితే కాని, ఈ సమస్య తప్పదని స్థానికులు అంటున్నారు. అప్పటి దాక రోడ్లు మళ్లీ వేయాల్సిందేనంటున్నారు. లేదంటే గుంతలు ఎప్పకప్పడు పూడ్చి సరిచేసుకోవాల్సిందేనని చెబుతున్నారు.

ఇలా అయితే బ్రహ్మదేవుని దర్శనం ఎలా?



బ్రహ్మదేవాలయం మార్గంలో నీరు

చేబ్రోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేబ్రోలులోని అరుదైన చతుర్ముఖ బ్రహ్మ లింగేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించేందుకు దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుంటారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు దేవాలయంలోని కోనేరులో వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక.. ఆలయంలోకి భక్తులు వెళ్లే మార్గం నీటితో నిండిపోయింది. రోజుల తరబడి నీటిని బయటకు తరలించే విషయమై దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించే వీలు లేక నిరుత్సాహంగా తిరిగి వెళ్తున్నారు. భక్తులు స్వామివారి దర్శనం కలిగేలా చేయాలని కోరుతున్నారు.

మెడికల్ కళాశాలలపై దుష్ప్రచారాలను నమ్మొద్దు

● కేంద్ర నిధులతోనే నిర్మాణ పనులు

● మెగా వైద్య శిబిరంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే యరపతినేని, టీటీడీ సభ్యుడు జంగా



మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, వేదిక పై ఎమ్మెల్యే యరపతినేని, జంగా

దాచేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలను నమ్మొద్దని , ప్రైవేట్ పరం చేస్తారన్న ఆరోపణలు ఒట్టి అబద్ధపు మాటలేనని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు కొట్టిపడేశారు. ఆదివారం ఆర్కా, ఉన్నం హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో దాచేపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పిడుగురాళ్ళ ఉన్నం హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్యులు ఉన్నం నాగ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై, ప్రారంభించారు. అనంతరం సభలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు ఇస్తే అందులో మూడు మెడికల్ కళాశాలలు మచిలీపట్నం, పాడేరు, బ్రాహ్మణపల్లిలలో ఏర్పాటు చేశారన్నారు. మెడికల్ కళాశాలలకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు మంజూరు చేయగా..అందులో కేంద్రం రూ.300 కోట్ల నిధులు మంజూరు చేసిందని వివరించారు. కేంద్రం నిధుల్లో కేవలం రూ.250 కోట్లు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆస్పత్రి నిర్మాణానికి మంజూరు చేయలేదని స్పష్టం చేశారు. కాని ఆస్పత్రులను ప్రైవేటీకరణ చేస్తున్నామంటూ తప్పుడు ప్రచారాలు ప్రతిపక్ష పార్టీలు చేపట్టడం సరైంది కాదన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎంపీ కోరారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి క్యాంపులు నిర్వహించడం మంచిదన్నారు. ప్రతిపక్ష పార్టీలు మెడికల్ కళాశాలలపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటున్నాయని, వారికి నరాల బలహీనత ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వైసీపీ నేతలు కూడా నరాల బలహీనత డాక్టర్లకు చూపించుకుంటే మంచిందని, అబద్దాలను మాట్లాడటం మానేస్తారని ఛలోక్తి విసిరారు. అనంతరం రూ70 లక్షలతో ఉన్నత పాఠశాలలో నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పేదలు ఎక్కువగా ఉన్న పల్నాడు ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో మంచి విషయమన్నారు.



తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, ఎంపీ లావు, జంగా, డాక్టర్ ఉన్నం

కొండవీడు రాజుల సాహిత్య సేవ మరువలేనిది

● అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాదు, మర్రి రాజశేఖర్, డొక్కా తదితరులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎర్రన్న, శ్రీనాథుడు వంటి కవి పండితుల్ని ఆదరించడంతో పాటు అనేక స్వీయ రచనలు చేసిన కొండవీడు రాజుల సాహిత్య సేవ మరువలేనిదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు అన్నారు. గుంటూరులోని కలెక్టరేట్ రోడ్డులో ఉన్న భారతీయ విద్యా భవన్‌లో కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం నాటకానికి కాటయ వేమారెడ్డి రచించిన కుమారిగిరి రాజీయమ్ అను వ్యాఖ్యాన గ్రంథ ఆవిష్కరణ, సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ దీవి నరసింహదీక్షిత్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాదు మాట్లాడుతూ కొండవీడు హెరిటేజ్ సొసైటీ వారు ప్రచురించిన ఈ గ్రంథం కొండవీడు రాజుల సాహిత్య ప్రతిభా పాటవానికి ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. చరిత్ర అధ్యయనం చేయడం ద్వారా గతంలో జరిగిన పొరపాట్లును, విజయాలను తెలుసుకోగలుగుతామని పేర్కొన్నారు. బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న అమరావతి శిల్ప సంపదను వెనక్కి తీసుకురావడం కంటే.. మన దగ్గర చరిత్ర సంపదను రక్షించుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ దీవి నరసింహదీక్షిత్ మాట్లాడుతూ కాళిదాసు వ్యాఖ్యానం రచించిన కొలచాల మల్లినాథసూరి, నాటకాలకు తొలి వ్యాఖ్యలందించిన కాటయ వేముడు ఇద్దరూ తెలుగువారు కావడం మన అదృష్టమన్నారు. ఎమ్మెల్సీ మర్రిరాజశేఖర్ మాట్లాడుతూ కొండవీడు పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు కల్లి శివారెడ్డి గణనీయమైన కృషి చేస్తున్నారని ప్రశంసించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ.. గత చరిత్రను, సంస్కృతిని నిర్లక్ష్యం చేసిన సమాజం అభివృద్ధిని సాధించలేదన్నారు. భావితరాలకు సాంస్కృతిక వారసత్వ స్ఫూర్తిని కలిగిస్తున్న కొండవీడు అభివృద్ధి సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ సంపాదకుడు మోదుగల రవికృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కొండవీడు హెరిటేజ్ సొసైటీ కార్యదర్శి కల్లి శివారెడ్డి, గ్రంథ ప్రచురణకు ఆర్థిక సాయం అందించిన ఆవుల మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒకటిగా జీవనం.. ఒకేసారి మరణం

● ఆరబెట్టిన దుస్తులు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైన తల్లి

● కాపాడే క్రమంలో తల్లితోపాటు కుమార్తె మృతి



భాగ్యమ్మ(ఫైల్)



పిచ్చమ్మ (ఫైల్)

పొన్నూరుటౌన్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఆరబెట్టిన దుస్తులు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై తల్లి, కుమార్తె మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జూపూడి గ్రామానికి చెందిన భాగ్యమ్మ (68).. కుమార్తె రేమల్ల పిచ్చమ్మ (45) వద్దే ఉంటోంది. ఇద్దరూ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం తల్లి, కుమార్తె వ్యవసాయ పనులు నిమిత్తం వెళ్లి.. తిరిగి వచ్చారు. వర్షం కురుస్తుండటంతో ఇంటి వద్ద ఇనుప తీగపై ఆరబెట్టిన దుస్తులను తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. తొలుత భాగ్యమ్మ విద్యుదాఘాతానికి గురవ్వగా.. గమనించిన కుమార్తె పిచ్చమ్మ తల్లిని కాపాడే క్రమంలో తాను కూడా కరెంట్‌షాక్‌కు గురైంది. తల్లి, కుమార్తె ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వీరి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను శవ పరీక్షల నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సచివాలయంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

● నేటి నుంచి కలెక్టర్ల సదస్సు.. అనంతరం అసెంబ్లీ సమావేశాలు



ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజధానిలోని సచివాలయంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు కలెక్టర్ల సదస్సు జరగనుంది. అనంతరం అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. అదే విధంగా డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. రాజధానిలో ఈ కార్యక్రమాల నేపథ్యంలో సచివాలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. ఆదివారం ఉదయం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జిందాల్ ఆ తర్వాత డీఎస్పీలు, సీఐ, ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. వెలగపూడి సచివాలయంలో కలెక్టర్ల సదస్సుకు సంబంధించి 5వ బ్లాక్ నందు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి, వీవీఐపీ, వీఐపీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎక్కడికక్కడ బారికేడింగ్‌తో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఈ నెల 18న సచివాలయంలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వీవీఐపీ, వీఐపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల రాకపోకల మార్గాలను, పార్కింగ్ ప్రదేశాలను, మీడియా పాయింట్ వంటి పలు ప్రదేశాలను పరిశీలించి, తగిన ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ నెల 19న వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో నిర్వహించే డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమ నిర్వహణ ప్రదేశాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్‌బీ సీఐ అలహరి శ్రీనివాసరావు, తుళ్లూరు సీఐ కొంకా శ్రీనివాసరావు, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి.. సూపర్

(5వ పేజీ తరువాయి)

ఆదరణ లభిస్తోంది. జిల్లాలో పెద్దఎత్తున మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుకు వస్తున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతున్నా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ యంత్రాంగం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. జీరో టిక్కెట్లు జారీ చేస్తూ రోజు వారీ ఎంత మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారో నమోదు చేస్తోంది. భవిష్యత్తులో మరింతగా పెరిగే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనపు బస్సులను సిద్ధం చేసుకోవడంపై ఆర్టీసీ దృష్టి సారించింది. ఇదిలా ఉంటే స్త్రీశక్తి పథకం అమలయ్యాక జిల్లాలో తిరిగే హైటెక్ బస్సుల్లో ఆక్యుపెన్సీలో స్వల్ప స్థాయి తగ్గుదల కనబడుతోంది. మొత్తం ఉన్న బస్సుల్లో హైటెక్ బస్సుల సంఖ్య అతి స్వల్పంగా ఉండడంతో అది ఆర్టీసీ ఆదాయంపై పెద్దగా ప్రభావం చూపదనే అభిప్రాయాన్ని యంత్రాంగం వ్యక్తం చేస్తోంది. ఉదయం 8 గంట నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు మహిళల రద్దీ బస్సుల్లో ఎక్కువగా ఉంటోందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

నవోదయలో నేరుగా 11వ తరగతి ప్రవేశం

చిలకలూరిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతి కామర్స్ గ్రూపులో భర్తీకాని 19 సీట్లకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా ప్రవేశం కల్పించనున్నట్లు ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆసక్తి గల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు తమను సంప్రదించాలని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వారే కాక ఇతర జిల్లాల విద్యార్థులకు ఆహ్వానం పలికారు.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం

యడ్లపాడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడు మండల పరిధిలో వంకాయలపాడు, బోయపాలెం మధ్య జాతీయ రహదారి సర్వీసు మార్గంలో వెళ్తున్న లారీ అగ్నికి ఆహుతైంది. ఆదివారం తెల్లవారు జామున ఈ ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ వంకాయలపాడు గ్రామాన్ని దాటి బోయపాలెం గ్రామాన్ని సమీపిస్తుండగా ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో లారీ పూర్తిగా దగ్ధమైంది. లారీలో గుడ్డిపత్తిని తరలిస్తుండగా సాంకేతిక లోపం తలెత్తి ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. అయితే లారీకి సంబంధించిన వారు సాయంత్రం వరకు ఎవరూ అందుబాటులోకి రాలేదు.

సాగర్‌కు పోటెత్తిన వరద

● 26క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు పోటెత్తింది. ఆదివారం శ్రీశైలం నుంచి 2,40,313 క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 588.50 అడుగులు ఉంది. ఇది 307.57 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 9,500, ఎడమ కాలువ ద్వారా 3,090, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, 16 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 10 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,74,248 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 3,22,424 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అండ్ సర్వేయర్స్ అసోసియేషన్

జిల్లా అధ్యక్షుడిగా ఉన్నం వేణుగోపాలరావు



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా లైసెన్స్‌డు ఇంజనీర్స్ అండ్ సర్వేయర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఉన్నం వేణుగోపాలరావు ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతిని ఆదివారం మాచర్ల పట్టణ సమీపంలో న్యూటన్స్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సభను ముఖ్య అతిథి మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, కళాశాల సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, మాచర్ల ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ ఇంజనీర్లు అందరూ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల ఇంజనీర్లు నరసరావుపేట ఇంజనీర్ ఉన్నం వేణుగోపాలరావును లైసెన్స్‌డు ఇంజనీర్స్ అండ్ సర్వేయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవగంగా ఎన్నుకున్నారు. ఏపీ ఓటీపీ జనరల్ సెక్రటరీ మైనేని లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు నాగ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి బొందిలి శ్రీనివాస్ సింగ్, సీనియర్ ఇంజనీర్ జి.పి.రంగయ్య , యర్రం అనిల్ తదితరులు వేణుగోపాల్ రావుకి కృతజ్ఞతలు తెలిపారు.

తీరంలో యువకులను రక్షించిన గజ ఈతగాళ్లు

బాపట్లరూరల్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్ర తీరంలో ముగ్గురు యువకులు అలలకు కొట్టుకుపోయారు. గమనించిన గజ ఈతగాళ్లు, పోలీసులు వారిని రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ సూర్యలంక తీరంలో నిర్ణయించిన ప్రదేశాలలో మాత్రమే పర్యాటకులు స్నానాలు ఆచరించాలని తెలిపారు.

వలస కూలీ దంపతుల ఆత్మహత్యాయత్నం

తెనాలి క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూలి పనుల కోసం విజయనగరం జిల్లా నుంచి వలస వచ్చిన దంపతులు కుటుంబ కలహాల నేపథ్యంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన ఆదివారం తెనాలి బాలాజీ రావుపేటలో చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరానికి చెందిన అనకాపల్లి ప్రసాద్, అనురాధ భార్యభర్తలు. ఐదేళ్ల క్రితం కూలి పనుల కోసం తెనాలికి వలస వచ్చి బాలాజీరావుపేటలో నివాసం ఉంటున్నారు. వీరికి ఐదు, నాలుగు సంవత్సరాల వయసు గల ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. సాయంత్రం పక్కంటి వారు.. వారి

ఆందోళనకరంగా భార్య పరిస్థితి

ఇంటిలోకి వెళ్లగా భార్యభర్తలు ఇద్దరూ అపస్మారక స్థితిలో పడిఉన్నారు. తోటి వారి సాయంతో వెంటనే వాళ్లను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య ఆరోగ్య స్థితి కొంత ఆందోళనగా ఉంది. కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాపట్ల వార్తలు

అస్తవ్యస్తంగా అంతర్గత రహదారులు

- కర్లపాలెం-పెదపులుగువారిపాలెం రహదారిపై భారీ గుంతలు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

కర్లపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు అంతర్గత రహదార్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కర్లపాలెం నుంచి పెదపులుగువారిపాలెం వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి ప్రయాణికులకు రహదారి నిత్యం నరకం చూపిస్తుంది. మండలంలోని 8 పంచాయతీలు, 25 గ్రామాల ప్రజలు నిత్యం వందలాది వాహనాలతో ఈ రహదారిపై ప్రయాణం చేస్తూనే ఉంటారు. ఈ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాలు మరమ్మతులకు గురై ప్రయాణికులకు పెనుభారంగా మారాయి. ఈ రోడ్డుపైన ప్రయాణం చేసే ప్రజలకు ఒళ్లంతా కదిలిపోయి అస్వస్థతకు గురవుతున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సన్నర కావస్తున్నప్పటికి ఈ రహదారి నిర్మాణానికి నోచుకోలేదని తీవ్ర అవస్థలు పడుతున్నామని పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప రహదారి నిర్మాణం చేపట్టిన దాఖలలేదని మండల ప్రజానీకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్లపాలెం నుంచి పెదపులుగువారిపాలెం, పెదగొల్లపాలెం నుంచి మరకావారిపాలెం, బత్తులవారిపాలెం, యారంవారిపాలెం, మార్పు చెన్నయ్‌వారిపాలెం, కట్టవాద వరకు కర్లపాలెం పోలీసుస్టేషన్ నుంచి జాతీయ రహదారిలో కలిసే దండుబాట, మండలంలోని పలు అంతర్గత రహదార్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఈ రహదార్లపై ప్రయాణిస్తున్న ప్రజలు ఎంత మొత్తుకున్న అధికారయంత్రాంగం, పాలకులు నిద్రావస్థ వీడటంలేదని నూతన కలెక్టర్ చొరవ తీసుకొని రహదారి నిర్మాణాలు వెంటనే చేపట్టి ప్రయాణికుల సమస్యను తీర్చాలని మండల ప్రజానీకం ముక్తకంఠంతో కోరుతున్నారు.



కర్లపాలెం బీసీ హాస్టల్ సమీపంలో రహదారిపై ఏర్పడిన గుంతలు



కర్లపాలెం-పెదపులుగువారిపాలెం రహదారిపై పెద్దగోతులు

రైతులందరికీ యూరియా సకాలంలో అందించాలి

- కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

కర్లపాలెం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో రైతులందరికీ యూరియా సకాలంలో అందేవిధంగా వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకొని యూరియాను రైతులకు సకాలంలో పంపిణీ చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదగొల్లపాలెం పంచాయతీ పరిధిలో గల మార్పు చెన్నయావారిపాలెంలో జరుగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. స్థానిక రైతులకు కలెక్టర్ యూరియాను అందజేశారు. గ్రామంలో రైతులకు యూరియా అందుతున్న తీరు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర విషయాలన్నిటిని కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతు సేవాకేంద్రాల ద్వారా విడతల వారీగా యూరియా పంపిణీ జరుగుతుందని, మండలస్థాయి, గ్రామస్థాయి సిబ్బంది పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అవసరమైన ప్రతిరైతుకి సకాలంలో యూరియా అందాలని సూచించారు. రైతులు అవసరానికి మించి యూరియాను నిల్వ చేయరాదని రైతులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి అన్నపూర్ణ, ఆర్డీవో గ్లోరియా, ఏడీఏ ధనరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సుమంత్‌కుమార్, ఎస్‌ఐ రవీంద్ర, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విద్యతోనే ప్రగతి

- మాజీమంత్రి మోపిదేవి వెంకటరమణ
- ఉద్యోగాలు పొందిన అగ్నికుల క్షత్రియులకు సన్మాన మహోత్సవం
- జిల్లాలో 66మంది ఉపాధ్యాయులు, 25మంది పోలీసులుగా ఎంపిక

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ప్రగతి సాధ్యమనే విషయాన్ని ప్రతిఒక్కరు తెలుసుకోవాలని మాజీమంత్రి మోపిదేవి వెంకటరమణ తెలిపారు. మెగా డీఎస్సీ, పోలీసు నియామకాల్లో ఉద్యోగాలు సాధించిన అగ్నికుల క్షత్రియులకు పల్లవసేన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మాన మహోత్సవం ఆదివారం సాయిరాం గ్రాండ్ కన్వెన్షన్ నందు జరిగింది. కార్యక్రమానికి జేపీసీ చైర్మన్ అడ్వకేట్ సైకం రాజశేఖర్ అధ్యక్షత వహించగా మోపిదేవి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యావ్యాప్తికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అర్హులైన పేదవిద్యార్థులకు చేయూతనందిస్తానని హామీనిచ్చారు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామంలో 26మందికి డీఎస్సీలో ఉద్యోగాలు రావటం హర్షణీయమన్నారు. అదేవిదంగా కానిస్టేబుళ్ళుగా నలుగురు ఎంపికవ్వటం సంతోషదాయకమన్నారు. చదువుకోవాలన్న తపన ఉన్నవారికి మంచి అవకాశాలు లభిస్తాయని వారికి సహకారం అందిస్తానన్నారు. అగ్నికుల క్షత్రీయులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అగ్నికులక్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ అగ్నికులక్షత్రీయ సామాజికవర్గం తీరప్రాంతాల్లో జీవిస్తూ అభివృద్ధికి నాగరికతకు దూరంగా దుర్భర స్థితిలో ఉన్నారన్నారు. కులవృత్తుల్లో కొనసాగలేని కుటుంబాలు వృత్తికి, ఉపాధికి దూరంగా ఉండాలన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బాపట్లజిల్లా నుంచి అగ్నికుల క్షత్రీయులు 66మంది ఉపాధ్యాయులుగా, 25 మంది పోలీసు కానిస్టేబుళ్ళుగా ఎంపికవడం సంతోషదాయకమన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో మహిళా పారిశ్రామికవేత్త అనంత విజయ హేచరీ నిర్వహిస్తూ అవార్డు అందుకోవటాన్ని హర్షిస్తూ ఆమెను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ మత్స్యకారసెల్ కన్వీనర్ బొమ్మిడి గణేష్,జాతీయమత్స్యకార సంఘం నాయకులు అనంత నగేష్, మోపిదేవి హరనాధబాబు, శ్రీకాంత్, న్యాయవాది కె.చంద్రశేఖర్, అగ్నికుల మహాసంఘం గౌరవాధ్యక్షులు కొక్కిలిగడ్డ సుబ్బారావు, సైకం రాజశేఖర్, కె.చంద్రశేఖర్, నాగరాజు, మోపిదేవి శివనాగరాజు, నాగబాబు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీమంత్రి మోపిదేవి వెంకటరమణ

జిల్లా కబడ్డీ బాలబాలికల జట్లు ఎంపిక



కబడ్డీ బాలుర జట్టుతో నిర్వాహకులు



కబడ్డీ బాలికల జట్టుతో నిర్వాహకులు

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో 51వ నూతన బాపట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల సెలక్షన్స్ జరిగాయి. ఇందులో బాలికలు 60మంది, బాలురు 78మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన బాలబాలికల్లో 14మంది చొప్పున ఎంపిక చేయబడ్డారు. వీరు ఈనెల 21వ తేదీ వరకు మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించే క్యాంప్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. క్యాంప్ ముగించుకొని విజయవాడలో జరిగే అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపిక కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ పీడీ కత్తి శ్రీనివాసరావు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అర్జునరావు, మంతెన సుబ్బరాజు, జాయింట్ సెక్రటరి మరకా సాయికుమార్, కోశాధికారి రాధాకృష్ణ, కోచ్ శైలజ, పీడీలు శ్రావణి, మమత, లలితమ్మ, శాంతకుమారి, బాపట్ల కబడ్డీ క్లబ్ నాయకులు సాంబశివరావు, నాగులు, నాగేశ్వరరావు, విజయ్, రామాంజనేయులురెడ్డి, ఊసా హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16న జిల్లా స్కూల్‌గేమ్స్ జట్ల ఎంపిక

బాపట్లరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలురు, బాలికల విభాగాల జిల్లా స్కూల్‌గేమ్స్ జట్ల ఎంపిక ఈనెల 16వ తేదీన ముత్తాయిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని బాపట్లజిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. బైక్వాడో బీచ్‌వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కావున ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల బాలబాలికలందరు సంబంధిత పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుల సంతకంతో ఎంట్రీ ఫారంతో హాజరుకావాలని, ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌ను వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణ, శ్యాంబాబు తదితరులు

కొల్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుండగులు వాహనాన్ని దహనం చేయడంతో నష్టపోయిన టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం కొల్లూరులోని టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ స్వగృహంలో బాధిత టీడీపీ కార్యకర్త జగజ్జీవన్‌రావుకు గృహలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ యజమాని తుమాటి శ్యాంబాబు రూ.20 వేలు, చిలుమూరు గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు మొలబంటి రామారావు రూ.5 వేలు నగదును మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. మరికొంత మంది నాయకులు, కార్యకర్తలు కూడా తమ వంతు ఆర్థిక సాయం అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చినట్లు మైనేని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోరికపూడి ప్రసాద్, పెదపూడి నాగరాజు, వేములపల్లి మోహనకృష్ణ, పోతార్లంక కుటుంబరావు, యడ్ల శ్రీను, గాదె చంటి, ఈమని మణికంఠ, పవన్‌కుమార్, దావులూరి ఏడుకొండలు, ఆరుమళ్ల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 800బస్తాల యూరియా పంపిణీ



మోర్లవారిపాలెంలో రైతులకు యూరియాను అందిస్తున్న తెలుగుయువత అధ్యక్షుడు మోర్ల బాలకృష్ణ

రేపల్లె, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరత కొరత లేకుండా సమృద్ధిగా అందిస్తున్నామని తెలుగుయువత అధ్యక్షుడు మోర్లబాలకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని మోర్లవారిపాలెంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సహకారంతో రైతులకు రెండు విడతలుగా 800బస్తాల యూరియాను అందించామన్నారు. రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాఘవయ్య, కొండలు, నాగబాబు, వాసు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అసమర్థతను చంద్రబాబుకు పులమటం నీచం : కొల్లా

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అసంపూర్ణ నిర్మాణాలుగా నిలిచిపోయిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వంలో పూర్తి చేయటానికి ముందుకొచ్చే పెట్టుబడిదారులకు జగన్ తీవ్రహెచ్చరికలు చేస్తూ మేము అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసి వెనక్కి తీసుకుంటామని బెదిరింపులకు దిగటం వైసీపీ దిగజారుడు నీచరాజకీయాలకు నిదర్శనమని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ జగన్‌తోపాటు మాజీమంత్రులు రోజా, అప్పలరాజులు కూడా చంద్రబాబుపై చౌకబారు విమర్శలు చేస్తూ తన అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో నిర్మాణాలు ప్రారంభించిన 17కాలేజీల్లో కేవలం ఐదింటిలో మాత్రమే అరకొర వసతులతో క్లాసులు ప్రారంభమయ్యాయన్నారు. మిగిలిన 12 కాలేజిలు పునాదులు పైకి రాని స్థితిలో ఉన్నాయన్నారు. జగన్ అసమర్థతను చంద్రబాబుకు పులమటం నీచరాజకీయమని కొల్లా అన్నారు.

కార్యకర్త కుటుంబానికి పార్టీ రూ.5 లక్షల సాయం



కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం నుంచి అందించిన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. భట్టిప్రోలు మండలం కోనేటిపురంకు చెందిన టీడీపీ కార్యకర్త మురాల పాములు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాద బీమా కోసం అవసరమైన పత్రాలు స్వీకరించి ఎమ్మెల్యే ఆనందబాబు సిఫారసు మేరకు రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపించారు. అక్కడి నుంచి మంజూరైన రూ.5 లక్షలు చెక్కును ఆదివారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబసభ్యులకు ఆనందబాబు బీమా సాయం అందించారు. బాధిత కుటుంబసభ్యులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

తక్కువ ధరకే ప్రజలకు ఉల్లిపాయలు



మార్కెట్‌యార్డులో ప్రజలకు ఉల్లిపాయలను అందిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు తక్కువ ధరలకే ఉల్లిపాయలను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఎటువంటి లాభాలు లేకుండా కొనుగోలు ధరలకే ఇవ్వటం శుభపరిణామమని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్‌యార్డులో ప్రజలకు తక్కువ ధరలకే ఉల్లిపాయలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిపాయలను అదేధరకు మార్కెట్ కమిటీ ద్వారా వినియోగదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

మహా మహేశ్వరీదేవిగా శ్రీబగళాముఖి అమ్మవారు



మహా మహేశ్వరిదేవి అలంకరణలో శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారికి ఆదివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు పాడి పంటలతో సుఖసంతోషాలతో అనుగ్రహించే మహా మహేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణమే సంస్థ లక్ష్యం

- మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి

కర్లపాలెం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజం నిర్మించటమే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి అన్నారు. కర్లపాలెంలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కర్లపాలెం మండల నూతన కమిటీని రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్లపాలెంలో ఏర్పాటు చేసినది 140వ శాఖ అని సంస్థలో లక్షమంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. అధ్యక్షుడిగా తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షులుగా బేతాళం నాగరాజు, కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, సహకార్యదర్శి మున్నం శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ తూనుగుంట్ల లలితబాబు, డైరెక్టర్లు తూనుగుంట్ల రామ్మోహనరావు, గొట్టిముక్కల బాలాజి, బొమ్మనబోయిన సాంబయ్య, పోలీసురావు, బాలాజిరెడ్డి, నాగవర్మరాజు, మల్లికార్జునరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీభాషా దినోత్సవ సభలో మాట్లాడుతున్న పలువురు వక్తలు, రచయితలు

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో మాట్లాడే భాషలో హిందీ ప్రథమ స్థానంలో ఉందని ప్రపంచంలో అత్యధిక ప్రజలు మాట్లాడే భాషల్లో హిందీ కూడా ఒకటని.. అది జాతీయ భాష అని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ఆదివారం బాపట్ల సాహితిభారతి ఆధ్వర్యంలో హిందీభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రిమాల్యాద్రిరావు, హిందీ పండిట్‌లు అబ్దుల్ ఖాదర్ జిలానీలు పాల్గొని మాట్లాడుతూ హిందీభాషను జాతీయ భాషగా సెప్టెంబరు 14న 1949లో రాజ్యాంగంలోని 351వ అధికరణంలోని 8వ షెడ్యూల్ పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో సాహితిభారతి సభ్యులు దగ్గుమల్లి శామ్యూల్, షేక్.నిహాల్ అహ్మద్, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జినే శ్మశానం



కాకర్లమూడిలో రోడ్డు మార్జిన్‌లో నిర్మితమైన దళితుల సమాధులు

వేమూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకర్లమూడి గ్రామంలోని దళిత కుటుంబాలకు ప్రత్యేకంగా శ్మశాన స్థలం లేని కారణంగా రోడ్డు మార్జిన్‌ను శ్మశానంగా ఎంచుకుని సమాధులు నిర్మిస్తున్నారు. గ్రామంలో రెండు వర్గాలకు చెందిన 22 కుటుంబాలు నివసిస్తుంటాయి. ఎస్సీలో ఒక వర్గానికి చెందిన వారు సుదూర ప్రాంతంలో ఉన్న చదలవాడ గ్రామంలోని దళితవాడ శ్మశానంలో తమకు సంబంధించిన వారు ఎవరైనా మరణిస్తే ఎంతో వ్యయ ప్రయాసలతో వెళ్లి ఖననం చేస్తారు. మరో వర్గానికి చెందిన ఎవరైనా మరణిస్తే గ్రామం నుంచి చింతలచెరువుకు వెళ్లే రోడ్డు మార్గంలో మార్జిన్‌లో ఖననం చేసి సమాధులు నిర్మిస్తున్నారు. సంబంధించిన కుటుంబాల వారు ఎంతోకాలం నుంచి తమ ఇబ్బందిని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న స్పందన లేదని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. దళితులకు ప్రత్యేకంగా శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎస్పీ ఉమామహేశ్వర్‌కు డీఎస్పీల శుభాకాంక్షలు



నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ ఉమామహేశ్వర్‌కు పూలమొక్క అందజేస్తున్న బాపట్ల, రేపల్లె డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఆవుల శ్రీనివాసరావు

బాపట్ల, రేపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్పీగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన బి.ఉమామహేశ్వర్‌ను బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ రేపల్లె డివిజన్‌లోని ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా చూడాలన్నారు. గంజాయి, అక్రమ రవాణా విక్రయాలను కట్టడి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీఐలు మల్లికార్జున్‌రావు, సురేష్‌బాబులు పాల్గొన్నారు.

మత్స్యకార సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



మత్స్యకార సంక్షేమ సంఘాల సమాఖ్య గుంటూరుజిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావును అభినందిస్తున్న మంత్రి కొల్లురవీంద్ర

రేపల్లె, కొల్లూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మత్స్యకార సంక్షేమ సంఘం సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన శేరు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆదివారం విజయవాడలో మత్స్యకార సంక్షేమ సంఘాల సమాఖ్య ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా శేరు శ్రీనివాసరావును రాష్ట్ర అధ్య క్షుడు ఎన్.అర్జున్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ ముత్యాలు ప్రకటించా రు. అనంతరం శ్రీనివాసరావును ఎక్సైజ్ మంత్రి కొల్లురవీంద్ర, రాజ్యసభ మాజీసభ్యుడు మోపిదేవి వెంకటరమణారావులు శాలువాకప్పి అభినందనలు తెలిపారు. సంఘీయుల అభ్యున్నతి కోసం కృషి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ పదవిని అందించిన మంత్రి కొల్లు రవీంద్రకు, మోపిదేవి వెంకటరమణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘీయుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఏచూరి చిరస్మరణీయుడు

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య



సీతారాం ఏచూరి పటానికి పుష్పాంజలి ఘటిస్తున్నగంగయ్య తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో ప్రతిపక్షాలను సైతం ఆకర్షించే విధంగా ప్రసంగించే అద్భుతమైన వక్తగా పేరుగాంచిన బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి చిరస్మరణీయుడని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య అన్నారు. ఏచూరి వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెం సమీపంలో శారదాపురి కాలనీ నందు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా ఏచూరి పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో గంగయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమచరిత్రలో ఏచూరి చెరగని ముద్ర వేశారన్నారు. కమ్యూమ్యూనిస్టుగా విద్యార్థి ఉద్యమంతో ప్రారంభమై అంచలంచలుగా ఎదిగా సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా అత్యంత ఉన్నతమైన అఖిల భారత కార్యదర్శిగా సమున్నతమైన పాత్రను నిర్వహించారన్నారు. ఏచూరి మరణం భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటు అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం నిర్వహించిన వైద్యశిబిరంలో శారదాపురలి కాలనీ, ఉప్పరపాలెం, రైలుపేట తదితర ప్రాంతాల రోగులు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్దార్థ, డాక్టర్ మధుబాబు, డాక్టర్ సునీతలు వైద్యపరీక్షలు నిర్వహించారు.

నిషేధిత వస్తువుల అక్రమ రవాణా చేయకూడదు

- సీఐ రాంబాబు

బాపట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాహనాల్లో మాదకద్రవ్యాలు, నిషేదిత వస్తువులను అక్రమ రవాణా చేయకూడదని పట్టణ సీఐ ఆర్.రాంబాబు హెచ్చరించారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ కూడలిలో ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి పెద్దఎత్తున వాహనాలు తనిఖీలు చేశారు. కార్లు, బైక్‌లు, ఆటోలతో సహ పలు వాహనాలను తనిఖీ చేసి వాహన చోదకులకు సూచనలు చేశారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటుబెల్ట్ ధరించి ఉంటేనే ప్రయాణం సురక్షితమని సూచించారు. ఆటోలకు సంబంధించి అవసరమైన పత్రాలను ఎప్పుడు దగ్గర ఉంచుకోవాలని డ్రైవర్లను ఆదేశించారు.

బాలికపై అత్యాచారం.. పోక్సో కేసు నమోదు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం జరిగిన ఘటనపై పొన్నూరు రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాపట్ల జిల్లాకు చెందిన బాలిక పొన్నూరు పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. అయితే బాలిక ఇటీవల అనారోగ్యానికి గురికాగా కుటుంబసభ్యులు వైద్య పరీక్షలు చేయించగా బాలిక గర్భం దాల్చినట్లు గుర్తించారు. బాపట్ల పోలీసులు ఈ ఘటనపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి పొన్నూరు రూరల్‌కు కేసు బదిలీ చేశారు. దీనిపై పొన్నూరు రూరల్ పోలీసులు, తెనాలి డీఎస్పీ జనార్ధన్‌రావు ఆదివారం విచారణ జరిపినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోక్సో అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.

అవీ..ఇవీ..

తక్కువ ధరకే కర్నూలు ఉల్లి అమ్మకాలు



అన్నగారి సంతలో అమ్మకాలు చేస్తున్న ఉల్లిపాయలు

అద్దంకి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఉల్లిధరలు తగ్గిపోయి రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి రైతు బజారులలో అమ్మకాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అద్దంకి మార్కెట్ యార్డులో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నగారి సంతలో కూడా కర్నూలు ఉల్లిపాయల అమ్మకం ప్రారంభించారు. రూ.100కు 6 కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. సుమారు టన్ను ఉల్లిపాయలు అద్దంకి మార్కెట్ యార్డుకు వచ్చాయి. దీంతో ఆదివారం అమ్మకాలు ప్రారంభించారు. బయట మార్కెట్‌లో కిలో ఉల్లిపాయలు రూ.25 ఉండగా మార్కెట్ యార్డులో తక్కువ ధరకే వస్తుండడంతో ప్రజలు పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు ఏఎంసీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ నేత మందా నాగేశ్వరరావులు ఉల్లిపాయల కొనుగోలు ను పర్యవేక్షించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురికి గాయాలు

- తీవ్రంగా గాయపడిన ఇద్దరు ఒంగోలు తరలింపు



గాయపడ్డ వేణు, రోహిత్

అద్దంకి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ఆదివారం మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకొన్నాయి. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన యరమోదు అంజయ్య భవాని సెంటర్‌లో మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా అద్దంకి పట్టణంలో నుంచి శింగరకొండ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. గాయపడ్డ అంజయ్యను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు. సాయంత్రం మేదరమెట్లకు చెందిన వడ్లమూడి వెంకటేశ్వరరావు మోటార్‌సైకిల్ పై వెళ్తూ రాజీవ్‌కాలనీ సమీపంలో అదుపు తప్పి పడిపోయాడు. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. రామ్‌నగర్‌లోని మార్కెట్ యార్డు వద్ద అద్దంకి పట్టణానికి చెందిన వేణు, రోహిత్‌లు మేదరమెట్ల వైపు నుంచి అద్దంకి వస్తుండగా రాంగ్‌రూట్‌లో రామ్‌నగర్ నుంచి మార్కెట్ యార్డులోకి వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. గాయపడ్డ వేణు, రోహిత్‌లను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు.

స్త్రీ శక్తి.. సూపర్

(5వ పేజీ తరువాయి)

ఆదరణ లభిస్తోంది. జిల్లాలో పెద్దఎత్తున మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించేందుకు ముందుకు వస్తున్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతున్నా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ యంత్రాంగం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. జీరో టిక్కెట్లు జారీ చేస్తూ రోజు వారీ ఎంత మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారో నమోదు చేస్తోంది. భవిష్యత్తులో మరింతగా పెరిగే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనపు బస్సులను సిద్ధం చేసుకోవడంపై ఆర్టీసీ దృష్టి సారించింది. ఇదిలా ఉంటే స్త్రీశక్తి పథకం అమలయ్యాక జిల్లాలో తిరిగే హైటెక్ బస్సుల్లో ఆక్యుపెన్సీలో స్వల్ప స్థాయి తగ్గుదల కనబడుతోంది. మొత్తం ఉన్న బస్సుల్లో హైటెక్ బస్సుల సంఖ్య అతి స్వల్పంగా ఉండడంతో అది ఆర్టీసీ ఆదాయంపై పెద్దగా ప్రభావం చూపదనే అభిప్రాయాన్ని యంత్రాంగం వ్యక్తం చేస్తోంది. ఉదయం 8 గంట నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు మహిళల రద్దీ బస్సుల్లో ఎక్కువగా ఉంటోందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

మందుబాబుల బీభత్సం

- నరసరావుపేట నుంచి చీరాలకు కారులో వచ్చిన యువకులు
- తిరిగి వెళ్లే సమయంలో స్కూటీను, ఆటోను ఢీ
- ఐదుగురికి గాయాలు
- టూటౌన్ పోలీసుల అదుపులో నిందితులు

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్యంమత్తులో పలువురు యువకులు రెండు రోడ్డు ప్రమాదాలకు కారకులయ్యారు. వివరాల్లోకి వెళితే ఆదివారం మధ్యాహ్నం నరసరావుపేట నుంచి రామాపురం తీరానికి కారులో ఐదుగురు యువకులు వచ్చారు. రాత్రి వరకు ఈ ప్రాంతంలోనే ఉన్నారు. మద్యంమత్తులో తిరిగి వెళుతూ మన్నం అపార్ట్‌మెంట్ వద్ద జాతీయ రహదారి ఎక్కేందుకు కారును వేగంగా నడిపారు. ఆ సమయంలో లక్ష్మీపురానికి చెందిన స్కూటీపై వెళుతున్న వ్యక్తిని ఢీ కొట్టారు. దీంతో ఆయన గాయల పాలయ్యాడు. అక్కడ నుండే తప్పించుకునే క్రమంలో హాయ్ రెస్టారెంట్ సమీపంలో ఓ ఆటోను వెనుక నుండి వేగంగా ఢీ కొట్టారు. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోతో పాటు కారు కూడా రోడ్డు పక్కన కాలువలోకి దూసుకుపోయింది. దీంతో స్థానికులు వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

అందరి మదిలో నిలిచేవే కావ్యాలు

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అన్ని వేళలా అందరి మదిలో నిలిచేవీ.., అందరిని ఉల్లాస భరితంగా నింపేవి కావ్యాలేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సాహితి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖుల కావాల్యను స్మరించి కొనియాడారు. అలాగే కవులను ఘనంగా సత్కరించారు. అంతకుముందు సంఘ సేవకులు దగ్గుబాటి హరిప్రసాద్ సంస్మరణ సభలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అప్పాజోస్యుల సత్యనారాయణ, యలమందరెడ్డి, కట్టా రాజ్‌వినయ్‌కుమార్, వూర మస్తాన్‌రావు, నాగవీరభద్రాచారి, డా.బీరం సుందరరావు, శివాంజనేయ ప్రసాద్, వెంకటేశ్వర్లు, రామారావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర దరఖాస్తుల స్వీకరణ

చినగంజాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అందజేయనున్న వాహన మిత్ర సాయానికి ఈ నెల 17వ తేది నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపిడీవో ఎస్ విజయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేది వరకు నూతన దరఖాస్తులకు అవకాశం ఉంటుందని, 22వ తేదిన క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేయడం, 24వ తేదీ నాటికి తుది జాబితా సిద్ధంచేయనున్నట్లు తెలిపారు. అక్టోబరు 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో 15 వేల రూపాయిల ఆర్థిక సాయాన్ని జమ చేస్తారన్నారు. దరఖాస్తుదారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్టర్ అయిన వాహనం కలిగి ఉండాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. మోటారు క్యాబ్, మాక్సీ క్యాబ్ యాజమానులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, ఆటో రిక్షా యాజమానులకు, తాత్కాలికంగా మినహాయింపు ఉందని, కానీ నెలలోపు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు పేదిరిక రేఖకు దిగువన ఉండాలని లేదా బీపీఎల్ రేషన్‌కార్డు కలిగి ఉండాలని తెలిపారు. కుటుంబసభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు లేదా పెన్షనర్లు అయితే అనర్హులన్నారు. పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు మినహాయింపు వర్తిస్తుందన్నారు.

ప్లాట్లు సిద్ధం.. మౌలిక వసతులే తరువాయి

- నివాసాల కోల్పోతున్న వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం
- రూ.15 కోట్లతో కాలువకట్టను మినీ బైపాస్‌గా మార్చేందుకు ఏర్పాట్లు



అద్దంకి కొండ వద్ద సిద్ధమైన ప్లాట్లు

అద్దంకి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో అంతర్భాగంగా ఉన్న అద్దంకి మేజర్ కాలువకట్టను మినీ బైపాస్‌గా మార్చే పనులు ప్రారంభం కానున్నాయి. దీనికి ఆక్రమణల తొలగింపే ప్రధాన అడ్డంకిగా ఉంది. దీనిపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. కాలువ కట్టలు ఆక్రమించి సుమారు 100కు పైగా కుటుంబాలు నివాసం ఉంటుండగా వారిలో సుమారు 35 మందికి బొమ్మనంపాడురోడ్డులోని లే-అవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. మిగిలిన 65 మందికి శింగరకొండపాలెం సమీపంలోని అద్దంకి కొండ వద్ద ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్లాట్లు సిద్ధం చేశారు. ఇళ్లస్థలాలు కేటాయించే ప్రాంతం లోతైన గోయ్యి కావటంతో మెగా ఇంజనీరింగ్ కంపెనీ సహకారంతో లెవలింగ్ చేయించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మౌలిక వసతల కల్పన ప్రారంభించారు. ఇప్పటికే రోడ్ల ఏర్పాటు పూర్తి కాగా, త్వరలో విద్యుత్ స్తంభాలు, బోర్ల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నారు. కాలువ కట్టను రేణింగవరం రోడ్డులో కాకానిపాలెం నుంచి నామ్‌రోడ్డు వరకు మినీబైపాస్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.15 కోట్ల అంచనాతో టెండర్ల దశకు చేరింది. త్వరలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అద్దంకి పట్టణంలో పర్యటించనున్నారు. అదే రోజు మినీ బైపాస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. అద్దంకి పట్టణంలో మూడు కమ్యూనిటీ భవనాలను కూడా మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ప్రారంభిస్తారని ఇటీవల విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

- విద్య, వైద్యానికి ప్రభుత్వం బాసట
- ఎమ్మెల్యే కొండయ్య



పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు విద్య, వైద్యం పట్ల కూటమి ప్రభుత్వం చక్కని బాటలు వేస్తోందని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఆదివారం నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో 120 మంది లబ్ధిదారులకు రూ.1.02 కోట్లు సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ సేవలు అందించేందుకు ఆపసోపాలు పడినట్లు వివరించారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్విరామంగా ప్రజా సమస్యలపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి దూర చూపుతో ఉన్నట్లు వివరించారు. ఈక్రమంలోనే ఇకపై ఆరోగ్యశ్రీ ప్రతి కార్డుకు రూ.25 లక్షలు వర్తింపజేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వివరించారు. అంతకు ముందు ఐఎంఎ అసోసియే షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి హేంద్రనాథ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన

637 మందికి వైద్యసేవలు



వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో టీడీపీ నేతలు

ఇంకొల్లు, సెప్టెంబరు 14, (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా నిరంతరం ప్రజల కోసం పనిచేసే సేవకుడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అని పర్చూరు ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు లు పేర్కొన్నారు. ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ఏలూరి చారిటబుల్‌ట్రస్టు, నోవాఅగ్రోటెక్, గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు శంకరకంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ జనహృదయనేతగా ఏలూరి సాంబశివరావు ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. నాయడు హనుమంతరావు మాట్లాడుతూ ఏ ఒక్కరూ కంటి సమస్యలతో బాధపడకూడదనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి ఆయన తండ్రి జ్ఞాపకార్థం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలేరు రామకృష్ణ, కరి శ్రీనివాసరావు, బోడెంపూడి సుబ్బారావు, నారిశెట్టి రాంబాబు, బాపయ్య, బేతపూడి సురేష్, రఫీ, మీరావలి, శివాజీ, వెంకటేశ్వర్లు, రాజా, చింపిరయ్య, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

637 మందికి పరీక్షలు

637 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 248 మందికి శస్త్రచికిత్సకు రిఫర్ చేశారు. పరీక్షల కోసం ప్రజలు పెద్దఎత్తున బారులు తీరారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రోగులకు బి.పి.షుగర్, రక్తపరీక్షలు చేసి వైద్యసేవలను అందించారు. శిబిరానికి వచ్చిన వారికి భోజనసదుపాయాలు ఏర్పాటు చేశారు.

రోడ్డు మధ్యలో ప్రమాదభరితంగా గొయ్యి



రోడ్డు మధ్యలో ఉన్న గొయ్యి

పంగులూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిలో ముప్పవరం ఫ్లైఓవర్ ఆనుకుని గ్రామానికి చేరుకునే అప్రోచ్ రోడ్డులో భారీ గొయ్యి ఏర్పడింది. రేణంగివరం నుంచి ముప్పవరం గ్రామంలోకి చేరుకునేందుకు ద్విచక్ర వాహనచోదకులు ఫ్లైఓవర్ ఆనుకుని ఉన్న ఈ అప్రోచ్ రోడ్డులో ప్రయాణం సాగిస్తుంటారు. అప్రోచ్‌రోడ్డులో ఏర్పడిన గొయ్యి వర్షపు నీటితో నిండి ఉండడంతో రాత్రిసమయంలో వాహన చోదకులు గోతిని గుర్తించలేక ప్రమాదాల బారినపడుతున్నారు. గడిచిన పదిరోజుల వ్యవధిలోనే పలువురు ఈ గోతివద్ద ప్రమాదం బారిన పడ్డారు. శనివారం రాత్రి ముప్పవరం గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు గోతి చుట్టూపేర్చిన నల్లనిరాళ్లను ఢీకొన్న ఘటనలో చేతికి, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. ఒంగోలు, అద్దంకి ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై పనుల నిమిత్తం వెళ్లే ఈ ప్రాంత ప్రజలు తిరిగి గ్రామాలకు చేరుకునేందుకు అప్రోచ్‌రోడ్డును ఆశ్రయించక తప్పని పరిస్థితి. జాతీయ రహదారిపై గ్రామ ప్రధాన కూడలిలో ఫ్లైఓవర్‌ను ఆనుకుని ఉన్న అప్రోచ్ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్నగోతికి తక్షణమే మరమ్మతులు చేయాలని ముప్పవరం, పంగులూరు, కోటపాడు, పరిసర ప్రాంతాల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

కారంచేడులో యూరియా కోసం రైతుల బారులు

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కారంచేడులోని పీఏసీఎస్ సహకార సంఘం సొసైటీ వద్ద ఆదివారం యూరియా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు తరలి వచ్చి బారులు తీరారు. దీంతో పంపిణీ కేంద్రం వద్ద సందడి వాతావరణం నెలకొంది. అయితే ఒక ఖాతా నెంబరుకు రెండు యూరియా బస్తాలు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే ప్రస్తుత యూరియా పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రైతులు తమ అవసరం మేరకే యూరియా తీసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. అదనంగా నిల్వలు ఉంచుకోవద్దన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి కుటుంబాలకు వైద్యం భారం కాకూడదని కూటమి ప్రభుత్వం వైద్యచికిత్సలు చేయించుకున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ అందజేస్తోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో వైద్య చికిత్సలు చేయించుకున్న 60 మందికి మంత్రి రవికుమార్ ఆదివారం చిలకలూరిపేటలోని తన నివాసం వద్ద చెక్కులను అందజేశారు. మరో ఐదుగురికి ఎల్‌వోసీలు అందజేశారు. కార్యక్రమాలలో ఆయా గ్రామాల నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బల్లికురవలో కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు నేపథ్యంలో సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేర్వేరు ఘటనల్లో ఇరువురు మృతి

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రమాదాల్లో చీరాల రైల్వే పోలీసు స్టేషన్ల పరిధిలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. గుర్తుతెలియని వ్యక్తి(45) సంవత్సరముల వ్యక్తి చీరాల - వేటపాలెం రైల్వేస్టేషన్ల మధ్య మృతిచెందాడు. ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. అలాగే చీరాల రైల్వే స్టేషన్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ రెండు ఘటనలపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని అద్దంకి, కొరిశపాడు మండలాలల్లో ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేది వరకు పశువులకు గాలికుంటూ నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ మేరకు అద్దంకి పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బ్రహ్మయ్య ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ టీకాల వలన పశువులకు జ్వరం రావడం, పాలు తగ్గడం లాంటివి ఏమి ఉండవన్నారు. తమ సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు పశుపోషకులు సహకరించి పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు.

విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయండి

పంగులూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహిస్తున్న విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షుడు మచ్చావెంకటేశ్వర్లు, తక్కెళ్లపాటి రామకృష్ణ, నాగేంద్రప్రసాద్ కోరారు. మండలంలోని కశ్యాపురం గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయప్రాంగణంలో 21వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు వివిధ వర్గాల ప్రజలు విరివిగా పాల్గొని ఈమహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. గతకొద్ది రోజులుగా టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యేను కలిసి వినతిని సమర్పించారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు బుర్రా సాంబశివరావు, చుక్కా శ్రీనివాసరావు, నారాయణ, వెంకటేశ్వరరెడ్డి, నాగరాజు, మధు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి ఆటల పోటీలు

మేదరమెట్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండల స్థాయి ఆటల పోటీలు పమిడిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం జరుగుతాయని మండల స్పోర్ట్స్ సమన్వయకర్త సుల్తాన్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయలు అంజయ్య తెలిపారు. అథ్లెటిక్స్‌లో జరిగే ఈ ఆటల పోటీలకు ప్రభుత్వ పాఠశాలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా పాల్గొనవచ్చన్నారు. వివరాలక 62814 22319 నంబరును సంప్రదించాలన్నారు.

నాగవరపమ్మకు సారె



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పందిళ్లపల్లి (చీరాల), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో వేంచేసిన నాగవరపమ్మ దేవస్థానంలో బోయినవారిపాలెం, బచ్చులవారిపాలెంకు చెందిన చప్పిడి వారి కుటుబంలోని మహిళ భక్తులు అమ్మవారికి చలిమిడి, సారె ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చప్పిడి వెంకటరావు, ఆదినారాయణ, వెంకటస్వామి, ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

చినగంజాం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గేదెలు, ఆవులు, ఆరునెలలు దాటిన దూడలకు ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేది వరకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు చినగంజాం పశు వైద్యాధికారి డాక్టర్ బత్తుల కృష్ణ ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పది వేల డోసుల టీకాలు పశు సంవర్ధక శాఖ ద్వారా మండలానికి పంపినట్లు పశు వైద్యాధికారి తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో పశు వైద్య సిబ్బంది ఈ టీకాల కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

భారతీయ భావనకు పునాది ఏచూరి

ఘనంగా ప్రథమ వర్ధంతి



ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో మాట్లాడుతున్న వక్తలు

చీరాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సాంస్కృతిక వారసత్వానికి, దేశ పురోగాభివృద్ధికి సీతారాం ఏచూరి సేవలు ఎనలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజం, ఆర్ఎస్ఎస్ నియంత్రతణకు ఏచూరి వ్యతిరేఖ ఉద్యమాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, ఎన్ బాబురావు, బత్తుల శామ్యేల్, మాచర్ల మోహన్‌రావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, గోసాల ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విధేయతకు గుర్తింపు

- విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కోడూరి



కోడూరి శేషుబ్రహ్మచారి

పర్చూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ విధేయుడిగా, నిబద్ధతగా పనిచేసిన యువనేతకు కూటమి ప్రభుత్వంలో అరుదైన గౌరవం దక్కింది. పర్చూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువనేత, బీసీ సెల్ నాయకులు కోడూరి శేషబ్రహ్మచారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సిఫారసు మేరకు విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పదవిలో సముచిత స్థానం కల్పించిన ఎమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధి సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని కోడూరి పేర్కొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఒంగోలు-కరవది రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం జరిగింది. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని, నిండు పచ్చ రంగు పంజాబీ డ్రెస్, కుడిభుజం పైన, ఎడమ చేతి మణికట్టుపైన పుట్టుమచ్చలు ఉన్నట్లు రైల్వే ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9440627647 సెల్‌నంబరులో సంప్రదించాలన్నారు.

కారు ఢీకొని చిరువ్యాపారి దుర్మరణం

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని చిరు వ్యాపారి రాయిని శేషయ్య(54) దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం పేర్న మిట్ట సమీపంలో పొగాకు బోర్డు వద్ద జరిగింది. శేషయ్య సమతానగర్‌లో నివాసం ఉంటూ పేర్నమిట్టలో బడ్డీకొట్టు నిర్వహిస్తున్నాడు. ఒంగోలు నుంచి మోపెడ్ మీద సరుకులు తీసుకెళుతుండగా కారు వెనుక నుంచి ఢీకొనడంతో ఘటన జరిగింది.